
# సమాధుల మీద ప్రసాదులు

సత్యం మందపాటి




రంగడు ఆ మురికి కాలువ గట్టుమీదే కూర్చుని ఉన్నాడు.

దాదాపు గంటనించీ కూర్చుని ఉన్నా డక్కడే.

సమయం రాత్రి తొమ్మిది గంటలపైన—

దోమలు శబ్దం చేసుకుంటూ అతని చుట్టూ తిరుగుతున్నాయి.

ఆకలేసిన దోమలు అతని మీద వాలి, బలిసిన శరీరంలోనించి రక్తాన్ని పీల్చుకుంటున్నాయి.

మునిసిపాలిటీ దీపం మసగ్గా వెలుగుతోంది.

రంగిడికి తెలుసు, ఆ ముష్టివాడి కుటుంబం ఆ రావిచెట్టు క్రిందే నివాసం ఏర్పరచుకుందని. అందుకే అటే చూస్తూ కూర్చున్నాడు.

ప్రస్తుత- ఆ రావిచెట్టు క్రింద ఎవరూ లేరు.

రావిచెట్టుమాత్రం అలాగే మంచుని ఉంది, ఎవరికయినా సరే ఆశ్రయం ఇస్తా నన్నట్టుగా.

చేతిలోని కర్ర సాయంతో కుంటుకుంటూ వచ్చాడు అసిరయ్య.

అసిరయ్య రెండో కొడుకు అతని చేయి పట్టుకుని ఉన్నాడు.

చేతిలోని మూటను ఒక ప్రక్కగా పెట్టి, కూర్చుని, ఎవరికోసమో ఎదురు చూస్తున్నాడు అసిరయ్య.

అసిరయ్య వళ్ళో తల పెట్టుకుని పడుకున్నాడు అతని రెండో కొడుకు.

రంగడు దూరంనించి, ఆ మురికి కాలువ గట్టు మీదనించే అసిరయ్యను చూస్తున్నాడు.

ప్రక్కన ఎవడో తాగి అరుస్తున్నాడు.

కాసేపటికి అసిరయ్య పెళ్ళాం మూకాలమ్మ, ఆమెతోపాటు అసిరయ్య కూతురు వచ్చారు.

వాళ్ళ చేతిలోని మూటను కూడా అక్కడే పెట్టి కూర్చున్నారు.

అసిరయ్య కూతుర్ని ఏదో అడుగుతున్నాడు.

ఆ పిల్ల మెల్లిగా ఏదో చెబుతున్నది.

ఇంకొంచెంసేపటికి అసిరయ్య పెద్ద కొడుకు పదేళ్ళ వాడు వచ్చాడు.

అతను రాగానే, మూకాలమ్మ వాడి చేతిలోని మూటను అందుకున్నది.

అందరూ గుండ్రంగా కూర్చున్నారు.

మూకాలమ్మ అందరూ తెచ్చిన మూటా కబళాన్ని కలిపి అయిదు భాగాలు చేసింది. అసిరయ్య, మూకాలమ్మ, ఇద్దరు కొడుకులూ, కూతురూ—ఐదుగురూ ఐదు భాగాలు తీసుకున్నారు.

ఆబగా, ఆకలిగా తింటున్నారు.

అటే చూస్తున్న రంగడు, ఒబ్బమీద దోమ కాటు చురుక్కుమనటంతో దృష్టి దోమమీదకు మళ్ళించాడు.

మురుగు వాసన అతని ముక్కుకి ఘాటుగా తగులుతోంది.

దోమలు బాగా కుడుతున్నా అలానే కూచున్నాడు.

అందరూ తినటం అయిపోయిన్తర్వాత, అక్కడే చెట్టుక్రింద పడుకున్నారు.

ఇంకో అరగంట గడిచింది.

చేతిలోని వెలుగుతున్న బీడీని విసిరేసి, లేచి నుంచున్నాడు రంగడు.

రావిచెట్టుకేసి మెల్లిగా నడిచాడు.

తను ఎంత పహిల్వాన్ అయినా, ఆ పని చేయగలడా?

ముందుకి నడిచాడు రంగడు.

తప్పదు. తన కిచ్చిన డబ్బు, ఈ పనికి ప్రతిఫలం. ఈ పని తెలిసే ఒప్పుకున్నాడు తను.

పూర్తిచేయక తప్పదు.

రంగడు రావిచెట్టు దగ్గరకు వచ్చాడు.

అసిరయ్యా, అతని భార్యా, పిల్లలూ అందరూ మంచి నిద్రలో ఉన్నారు.

అటూ ఇటూ చూశాడు రంగడు.

ఎక్కడా అలికిడి లేదు.

గబగబా అడుగులు ముందుకు వేశాడు.

అసిరయ్య కూతురు— ఐదేళ్ళ పిల్ల—ఆవాయకంగా నిద్రపోతున్నది.

చటుక్కున ఆ పిల్లని ఎత్తుకున్నాడు.

కళ్ళు తెరిచి అరవబోయిన ఆ పిల్ల నోరు గట్టిగా మూశాడు.

గింజుకోబోయిన ఆ చిన్న పిల్ల బలం పహిల్వాన్ రంగడి కండబలం ముందు ఏమాత్రం చాల్లేదు.

వడివడిగా నడిచాడు రంగడు.

దూరంగా ఎక్కడో గంటలు పన్నెండు కొట్టాయి

* * *

రంగడు బసవరాజు బంగళాకి చేరేసరికి, బసవరాజు ఇంట్లోని జపాను గడియారం మూడు గంటలు కొడుతున్నది.

గూర్ఖా చెప్పాడు—"అయ్యగారు నువ్వు వస్తే లోపలకు పంపించమన్నారు — వెళ్ళు" అని.

రంగడు బవసవరాజు గదిలోకి వచ్చాడు.

బసవరాజు ఒక్కడే కూర్చుని సిగరెట్ త్రాగుతున్నాడు.

రంగడ్ని చూడగానే 'ఏమయింది' అన్నట్టు చూశాడు.

"పూర్తయింది సార్" అన్నాడు రంగడు.

"గుడ్— ఎవరు ... ఇంతకీ ..." అడిగాడు బసవరాజు.

"అసిరయ్యని ఒక ముష్టివాడు—అతని కూతురు. అయిదేళ్ళ పిల్ల.వాళ్ళుఅందరూ పడుకోగానే ఆపిల్లను తీసుకు వెళ్ళాను. సరాసరి మన రంబా ఎస్టేట్కే వెళ్ళాను."

"అక్కడ గురువులు ఉన్నాడా?'

"ఉన్నాడు సార్ — అంతా అనుకున్నట్టే జరిగింది. ఎస్టేటు ముందరిభాగంలోనే పాతిపెట్టాం.

"చుట్టు ప్రక్కలా, బయటా ... రక్తం గిక్తం పడలేదు కదా?'

"లేదుసార్. గురువులు గుంట తవ్వి రెడీగానే ఉంచాడు. ఆ గుంటలోనే అంతా పూర్తిచేసి,

మన్న కష్టేగా — పైన ఈ పాటికి గురువులు పాలరాళ్ళు పరిచేసి ఉంటాడు.

"ఎవరూ చూడలేదు కదా ..." అనుమానంగా అడిగాడు బసవరాజు.

రంగడు మీసం మెలేసి గర్వంగా నవ్వాడు. "నాకు పని అప్పచెప్పిం తర్వాత అలాంటి పొరపాట్లు రావుసార్" అన్నాడు.

బసవరాజు సోఫాలోంచి లేచాడు.

"గుడ్ — వెల్‌డన్" అంటూనే జేబులోంచి కొన్ని వంద రూపాయల నోట్లు తీశాడు. రంగడికి అందించాడు.

"ఇవికూడా ఉంచు— పో" అన్నాడు.

రంగడు వెళ్ళిపోయాడు.

తర్వాత బసవరాజు పడుకున్నాడు కానీ నిద్ర పట్టలేదు.

రెండుకోట్ల రూపాయలతో నిర్మించిన రంభా ఎస్టేట్సుకి తెల్లవారగానే ప్రారంభోత్సవం.

ఎయిర్ కండిషన్డ్ సినిమాహాల్సూ, మూడు నక్షత్రాల హోటలూ, బారూ, షాపింగ్ సెంటరూ— ఒకటేకాదు రంభా ఎస్టేట్సులో లేనివి అంటూ ఏమీ లేవు. ఆ రంభా ఎస్టేట్సుకి యజమాని బసవరాజు. సినిమా రంగంలోనూ, బంగారంవ్యాపారంలోనూ సంపాదించిన దంతా, ఈ రంభా ఎస్టేట్సులో పెట్టేశాడు.

ఇన్నికోట్ల రూపాయలూ ఖర్చుపెట్టి ఈ భూలోక స్వర్గాన్ని నిర్మించిన తర్వాత, పురోహితుడు చావు కబురు చల్లగా బయట పెట్టాడు.

బసవరాజు జన్మ తిథీ, ఈఎస్టేటు వాస్తుశాస్త్రం ఎస్టేటు పని మొదలు పెట్టిన ముహూర్తం, అన్నీ కలిపి చూసిన పురోహితుడు, అసలు సంగతి, నాలుగు రోజులు లెక్కలు మళ్ళీ వేసిన తర్వాతే చెప్పాడు.

ఆ ఎస్టేట్ ప్రారంభం చేసిన రోజునే బసవరాజు మరణం తథ్యం అని చెప్పాడు. బసవరాజు ముందు ఆ మాట కొట్టివేద్దా మనుకున్నా, మరణం తన దనేసరికి, ఏం చేయాలో తోచక వణికిపోయాడు.

ప్రతి రోగానికీ ఓ మందులాగా, ఈ దోషానికి కూడా, ఒక విరుగుడు లాంటిది ఉందన్నాడు పురోహితుడు.

ఆ ఎస్టేటు ప్రారంభోత్సవానికి ముందుగా, ఆ ఎస్టేటులోనే నరబలివేస్తే, ఆ దోషం పోతుం దన్నాడు. బసవరాజు ప్రాణాని కింకేమీ భయం ఉండ దన్నాడు.

బసవరాజు వూ! అనలేదు! ఆఁ అనలేదు పురోహితుడి వారి ఇక వెళ్ళిరమ్మన్నాడు.

తర్వాత తన నమ్మినబంట్లు రంగణ్ణి, గురువుల్ని పిలిచి జరగవలసిన కార్యం వివరించాడు.

పొద్దుటికి ఎస్టేటు ప్రారంభోత్సవానికిముందే, అనుకున్న పని సవ్యంగా అయినందుకు సంతోషించాడు బసవరాజు.

మరునాడు కూడా మామూలుగానే తెల్లవారింది.

అయినా బసవరాజు జీవితంలో అదొక మరుపులేని రోజు.

ఆ రోజే రంభా ఎస్టేట్సు ప్రారంభోత్సవం.

గొప్ప [illegible] జరుగుతున్నాయి.

వూళ్ళో పెద్ద లందరూ ఆహ్వానింపబడ్డారు.

రంభా ఎస్టేట్సు రంగు రంగుల కాగితాలతో రకరకాల దీపాలతో కళకళలాడుతోంది.

ఎక్కడ చూసినా పాలరాతి గోడలు, అందమైన నగిషీలు.

ఖరీదైన మనుషులు, దుస్తులు, సువాసనలు.

ఎన్నో కార్లు వస్తున్నాయి.

ఎంతోమంది కార్లలోంచి దిగుతున్నారు.

కరచాలనాలు, నమస్కారాలు, ప్రతినమస్కారాలు.

లోపలికి రావటానికి వీలు లేని జనం ప్రహరీ గోడకు అవతల మూగుని ఉన్నారు.

వాళ్ళలో ముందు వరుసలో నుంచుని ఉన్నాడు ఆసిరయ్య.

అతని ప్రక్కన నూకాలమ్మ.

ఆమె ప్రక్కన వాళ్ళ ఇద్దరు కొడుకులు.

నూకాలమ్మ అంటున్నది: "లచ్చిమి ఈడే అయినా ఉండాదేమో చూడు సూవా. ప్రొద్దుటాల్నుంచీ కనబట్టలేదు — యాడుందో యేమో."

"అదే సూత్తన్నానే — ఈడా కనబట్టంలేదు" అన్నాడు ఆసిరయ్య అటూ ఇటూ పరికించిచూస్తూ.

వెనకనుంచి ఎవరో తోస్తున్నారు.

ముందుకు పడబోయాడు ఆసిరయ్య.

చేతిలోని కర్ర క్రింద పడింది.

గూర్ఖా అరుస్తున్నాడు "దూరంగా ఉండు వెనక్కిపో" అని.

నూకాలమ్మ అందించిన కర్ర అందుకుని, మళ్ళీ అక్కడే నించున్నాడు ఆసిరయ్య.

"నన కీడ తిండెడతారా అయ్యా" అంటున్నాడు ఆసిరయ్య కొడుకు.

"సూద్దాం — లోపట పెద్ద పారిటీ ఉందిగందా మనకేయారా మంచి కూడే దొరుకుద్ది" అన్నాడు ఆసిరయ్య.

నూకాలమ్మ అటూ ఇటూ పరికాయించి చూస్తున్నది. తన కూతురు లచ్చిమి కనబడుతుం దేమోనని.

"సినిమా స్టారు — సినిమాస్టారు ...' అంటున్నారెవరో.

అందరూ తోసుకుంటున్నారు.

పోలీసు లెవర్నీ ముందుకి రాకుండా, వెనక్కి నెడుతున్నారు.

ఆసిరయ్య చేతికర్ర ఎటో పోయింది.

అరుస్తున్నాడు.

పోలీసులు అరుస్తున్నారు.

అందరూ అరుస్తున్నారు.

ఇంతలో ఒక పెద్ద లేత నీలిరంగు విదేశీ కారు సరాసరి ఎస్టేట్ లోపలికి పోయింది.

దాంట్లోంచి సినిమా హీరో గారు దిగారు.

స్వాగతాలు, నమస్కారాలు.

ప్రహరీగోడ బయట ఉన్న వాళ్ళకు లోపల ఏం జరుగుతున్నదో అంతగా తెలియటం లేదు.

కానీ లోపల మైకులు పెట్టి, బయట జనం కోసం స్పీకర్లు పెట్టినందునా, ఏవో మాటలు వినబడుతున్నాయి.

"ఈ నాడు ఈ రంభా ఎస్టేట్సు నేను ప్రారంభోత్సవం చేయటం నా అదృష్టం. బసవరాజు నాకు మంచి మిత్రులు. మంచి మనిషి. డబ్బు అందరికీ ఉండవచ్చు. కానీ ఉత్తమ సంస్కారం, చక్కటి హృదయం, మానవత్వం అన్నీ ఉన్న వ్యక్తి మనకి చాలా అరుదుగా కనిపిస్తాడు. బసవరాజుగారు అలాంటి వారు. మొదటినుంచీ ఆయన ధనవంతుడయినా పేద ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకున్న మనిషి. ఒక బీదవాడు ఆకలితో అమ్మా అంటే విలవిల్లాడిపోయేవాడు. అలాంటి మనిషి— ఈ నాడు ఇంత ఎస్టేట్ కట్ట గలిగారంటే ... పేదప్రజలందరికీ గర్వకారణం ...'

బయట జనంలో తోపిడి ఎక్కువయింది.

ఆసిరయ్య కొడుకు ఆ హడావిడిలో క్రింద పడ్డాడు.

ఆ తొక్కిసలాటలో నలిగి క్రింద నించి 'అమ్మా' అని అరుస్తున్నాడు వాడు.

"లచ్చిమి గొంతు మాదా— లచ్చిమి." సంతోసంగా అంటున్నది నూకాలమ్మ.

"లచ్చిమి కాదే ఎర్రి మాలోకం — సిన్నోడు— కింద పడి అరుస్తా ఉన్నాడు —అడ్ని పైకి లేపు" అరిచాడు ఆసిరయ్య.

స్పీకరులోంచి ఈ సారి బసవరాజు గొంతు విన పడుతున్నది.

"నా రక్తం ధారపోసి సంపాదించిన డబ్బు ఇది. అయినా నేను నా కోసం ఖర్చుపెట్ట దలచుకోలేదు. ప్రజలకోసం ఈ డబ్బుని వినియోగం చేసి పేదరికాన్ని సమాధి చేద్దామనే కోరిక నాలో ఏ నాటినుంచో ఉంది. అందుకే ఈ నాడు ప్రజలకోసం నా డబ్బు ఖర్చు పెడుతున్నాను. ఈ రంభా ఎస్టేట్స్‌లో మంచి ఎయిర్—కండిషన్డ్ సినిమా హాలు ఉంది. మీ అందరూ హాయిగా సినిమాలు చూడవచ్చును. త్రీ స్టార్ హోటల్ ఉంది. రుచికరమైన, పుష్టికరమైన పదార్థాలతో భోజనం చేయవచ్చును. ఎయిర్ కండిషన్డ్ గదుల వసతి సౌకర్యం ఉంది — పేద ప్రజల అలసట తీర్చే విశ్రాంతి మందిరం ఈ రంభా ఎస్టేట్ ..."

గూర్ఖా ముందుకు తోసుకు వస్తున్న ఇంకో ముష్టివాడ్ని వెనక్కి తోస్తున్నాడు.

లోపల సినిమా హీరో గారు పాలరాతి వేదికపై నుంచుని దారికి అడ్డంగా కట్టిన గులాబి రంగు శాటిన్ రిబ్బన్ను కత్తిరిస్తున్నారు.

కత్తిరించటం కాగానే అందరూ చప్పట్లు కొట్టారు.

ఆయనకీ, బసవరాజుకీ దండలు వేశారు.

"మనం లోపటకి ఎళ్ళితే బాగుండును— కూసంత తిండి దొరుకుద్ది" అంటున్నాడు ఆసిరయ్య కొడుకు.

"మనం లోపట కెట్టా ఎడతాంరా ఎర్రి ఎదవా, మనొ ఎక్కడ, ఆళ్ళెక్కడ" అంటున్నాడు ఆసిరయ్య.

"లచ్చిమి ఏడుంది అయ్యా — లోపట్నా బయటా,.." అడిగాడు ఆసిరయ్య కొడుకు అమాయకంగా.

"లోపట ఎలా గుంటదిరా ఎర్రి నాగన్నా— ఆ లోపల ఈ జనమకి నేము — బయటే ఏడన్నా ఉంటది!" అన్నది నూకాలమ్మ అటూ ఇటూ లచ్చిమికోసం చూస్తూ.

కానీ నూకాలమ్మకి తెలీదు.

లచ్చిమి లోపలే ఉందని.

దండలు వేసుకుని నుంచున్న లావుపాటి బసవరాజు కాళ్ళ క్రింద ఉన్న పాలరాయి క్రింద ... తెల్లటి పాలరాయి క్రింద ... లచ్చిమి ఉందని నూకాలమ్మకి తెలీదు.

*